# యవ్వన

పాలపర్తి శ్యామలానందప్రసాద్




ఝుమ్మంటూ తుమ్మెదలు తిరుగుతున్నాయి. రేఁటి పూలన్నీ వింతగా చూస్తున్నాయి.

ఆ రెక్కల చప్పుడు గుండెలో చక్కిలిగిలి పెడుతోంది ఎప్పుడు తేనె వారుతుందో. కాలం గిరున తిరిగిపోతే బాగుండు వింత ఆనందం లేకపోతే ఆ పూలన్నీ నవ్వుతూ తుమ్మెదల కోసం ఎదురుచూస్తాయి! 'తుమ్మెద! అబ్బ! దేవుడు భలే మంచివాడు. అవునూ! తుమ్మెదలు మొగ్గల దగ్గరకు ఎందుకు రావు? వస్తేగా అడిగేందుకు? పూలల్లో తేనె తాగేస్తుందట. మరి అవెందుకు ఊరుకుంటున్నాయి? మా దగ్గరకు రావద్దని చెప్పక ఎదురు చూస్తూ ఉంటాయెందుకో? తొందరెందుకు. రేపు తన దగ్గరకు తుమ్మెదొచ్చినపుడు మెల్లగా సంగతులు కనుక్కోవాలి.'

"యవ్వానా! నీకు ఆ నవల ఎందుకే కాను పుస్తకాలు చదువుకోరాదూ. మహారాణిలాగా సాయంకాలమైతే ఆమేడమీద కూచోటంతప్ప ఇవతల చెంబుతీసి అవతల పెట్టే ఆశలేదు."

"అబ్బ నన్ను డిస్టర్బు చేయకు. మహా ఏం పనుంది అక్కడ. ఈ నవల పూర్తి అయితేనే కాని నేనురాను"

"మీ నాన్నతో చెబుతానుండు."

"చెప్పుకో! నాన్నేగా ఇది తెచ్చింది. అయినా నవలలు చదివితే ఏం."

"ఇట్టాగే ఎదురు మాట్లాడడం నాటి మహత్యమే. చదవండి తల్లీ చదవండి. ఇంటిల్లిపాదీ నవల్లు చదవండి సినిమాలు చూడండి నాదేంపోయింది."

"పో! నువ్వెప్పుడూ అంతే పాతచింతకాయపచ్చడి" అనేసి యవ్వన మళ్ళి నవలలో మునిగిపోయింది. అందులో వర్ణించిన హీరో యవ్వన ఊహాలోకంలో ఎంతో గొప్పగా, అందంగా లోకాతీతుడుగా మెరిసి పోతున్నాడు. నాయిక నాయకుడి రొమ్ముమీద పరిగెత్తుకుంటూవచ్చివాలిపోయేసందర్భంలో యవ్వన మనసే ముందు పరుగు పెట్టింది. 'ఆ చక్రాల్లాంటి కళ్ళూ, గాలికెగిరే పైటా, అలా ఉండాలి అమ్మాయిలంటే' అనుకుంది.

నవల పూర్తి అయింది. దాన్ని ప్రక్కన పెట్టి లేచి నుంచుని ఓ సారి మేడమీద నుంచి వీధిలోకి చూసింది. అతనొస్తున్నాడు అనుకొంది. రోజూ అదే సమయానికి ఇట్నుంచి వెళుతున్నాడు. ఎంత బావున్నాడో! ఆరు అడుగుల పొడవు, అందమైన చూపులు, ఖరీదైన వేషం, అచ్చం నవల్లోంచి పారిపోయి వచ్చినట్లున్నాడు. ఇల్లెక్కడో? ఏం చేస్తుంటాడో? ఇతన్ని ప్రేమిస్తే? అవునొకసారి ప్రేమించి చూడాలి. వెంటనే అతనికో ప్రేమలేఖ రాయాలి అనుకుంది.

ఆవాళ రాత్రి పుస్తకాల మధ్యన పెట్టిన నవలలన్నీ వెతికి ఓ ఉత్తరం తయారు చేసింది. దాన్ని జాగ్రత్తగా పుస్తకాల మధ్య దాచి పెట్టింది.

మర్నాడు సాయంకాలం మేడమీద నుంచుని అతను ఎప్పుడొస్తాడా అని ఎదురు

చూస్తోంది యవ్వన. ఎంతసేపటికీ రావడం లేదు 'మగాళ్ళెప్పుడూ ఇంతే' అని ఏదో సినిమాలో డైలాగు గుర్తొచ్చింది. వీధివంకే రెప్పలార్పకుండా చూడ సాగింది.

అతనొస్తున్నాడు. యవ్వన ఆనందానికి అంతులేదు. అతన్ని ఓ సారి ఆపాదమస్తకం చూసుకుంది. గుండెల్లో భయం. అతను వాళ్ళింటి ముందు కొచ్చేసరికి ఉత్తరంలో ఓ చిన్న రాయి పెట్టి అతనికి తగిలేటట్టు విసిరి కనపడకుండా తప్పుకుంది.

పరధ్యానంగా నడుస్తున్న అతను పైనుంచి ఏదో పడేసరికి ఉలికిపడి దాని వంక చూచాడు. ఏదో ఉత్తరంలా ఉంది. అతనికి అర్థంకాలేదు. తల పైకెత్తి చూశాడు. ఎవరూ కనిపించలేదు. దాన్నందుకుని ముందుకు నడిచాడు. కాస్త దూరం వెళ్ళాక విప్పిచూశాడు. 'ప్రియమైన... ఎవరో అనుకుంటున్నారా ? నేనే యవ్వనను...?' అంతే ఆరెండు వాక్యాలు చదివి అతను ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకొని పరుగులాంటి నడకతో తనగదికి చేరుకున్నాడు. తలుపు మూసి ఉత్తరం విప్పాడు.

'ప్రియమైన ... ...

ఎవరో అనుకుంటున్నారా ? నేనే యవ్వనను. అంటే మీమీద ఈ ఉత్తరం పడిన ఇంట్లో అమ్మాయిని. మీ పేరు నాకు తెలియకపోయినా అదికూడా చాలా అందంగా విజయ్, అర్జున్, శతృఘ్న, ఇలాంటి వాటిల్లో ఒకట్లై ఉంటుందనుకుంటాను. మీ అందం నన్ను పిచ్చిదాన్ని చేసింది. తొలి చూపులో మీరు నామనసు దోచుకున్నారు. మీ నుంచి నన్ను ఆదేవుడు కూడా విడతీయలేడు. రేపుసాయంత్రం పార్కులో మూల బెంచీమీద కూర్చుంటాను. నా ప్రేమను అంగీకరిస్తూ మీతొలి ప్రేమ లేఖతో అక్కడకు తప్పక వస్తారని ఆశిస్తున్నాను. రేపటి కోసం వేయి కళ్ళతో ఎదురు చూసే

మీ

యవ్వన'

అతను ఆశ్చర్యపోయాడు. 'ఎవరీమె ? నన్ను ప్రేమించిందా? నేనెప్పుడూ చూడలేదే. అందంగానే ఉండి ఉంటుంది. ఎంత అందమైన పేరు ? పదహారేళ్ళ పైన ఉండొచ్చు. బాగ ఉన్నవాళ్ళేనేమో.' అతను ఒకసారికి పదిసార్లు అద్దంలో తనను చూసుకుంటూ ఉత్తరం చదువుకున్నాడు. రాత్రంతా కష్టపడి, రాస్తూ, కొట్టేస్తూ, ఓ ప్రేమ లేఖ తయారు చేశాడు. ఆమె ఎలా ఉంటుందో అనేక రకాలుగా ఊహించుకున్నాడు. తెల్లారింది.

సాయంత్రం నీట్‌గా డ్రస్ చేసికొని పార్కుకు బయలదేరాడు. 'ఈ పాటికి వచ్చి ఉంటుందా ? తనెలా గుర్తుపట్టాలి? తనను చూచి చిరునవ్వు నవ్వుతుందిగా అదే గుర్తు. ఏ చీర కట్టుకొచ్చిందో ? వోణీలు వేస్తుందేమో ? వెనక నుంచి వెళ్ళి కళ్ళుమూస్తే...' అతని ఆలోచనలు తెగేలోపల మూల బెంచీ రానే వచ్చింది.

ఉలిక్కిపడ్డాడతను. ఓ పదకొండు, పన్నెండేళ్ళ పిల్ల ఆ బెంచీ చివరగా కూచోనుంది. ఇతన్ని చూచి నవ్వుగా నవ్వింది.

"ఎవరు నువ్వు?" అడిగాడతను.

"యవ్వన మా అక్కయ్య" అన్నది ఆ పిల్ల.


పైవారమే!

**ప్రేమ పాశం**

కొత్త సీరియల్


'ఓహో ! రావడానికి వీలుపడక చెల్లెల్ని పంపిందన్నమాట. పాపం ! ఇంటి దగ్గర వాళ్ళెవరైనా కనిపెట్టారేమో ! అయినా తనుండగా భయమెందుకు ?' అనుకున్నాడతను.

"నీ పేరేంటమ్మా !"

"విమల"

"మీ అక్కయ్యేం చెప్పింది ?"

"మీరేదో ఉత్తరం ఇస్తారు. దాన్ని జాగ్రత్తగా తెచ్చి తన కిమ్మని చెప్పింది."

"మీ అక్కయ్య ఏం చదువుతోంది ?"

"అదేంటి మీరు తన ఫ్రెండని చెప్పిందే. మీకు తెలీదా ! బియ్యే చదువుతోంది."

అతని కళ్ళు మెరిశాయి.

"మీ నాన్నగారు ఏంచేస్తుంటారు ?"

"పెద్ద ఆఫీసరు."

"సరేకానీ, మీఅక్కయ్య బాగుంటుందా?"

"మా అక్కయ్యను మీరెప్పుడూ చూళ్ళేదా ? అబ్బ ! నాకే ముద్దొస్తుంది. సినిమా యాక్టర్సు కూడా పనికి రారు తెలుసా ?"

అతని ఆనందానికి అంతులేదు.

"మీరేం చేస్తుంటారు ?" ఆ పిల్ల అడిగింది.

"ఎల్. డి. సి."

"ఏం చదివారు ?"

"ఎస్. ఎస్. ఎల్. సి"

కొంచెం సిగ్గు సిగ్గుగా సమాధానం చెప్పాడతను, తప్పించుకోవడానికి వీలులేక.

"ఊఁ ఉత్తరంఇవ్వండి నేను తొందరగా వెళ్ళాలి. మా అమ్మ కేకలేస్తుంది." అతను జేబులోంచి తీసి ఆపిల్లకిచ్చాడు ఉత్తరం.

"రేపు మీ అక్కయ్యను ఇక్కడికి రమ్మని చెప్పు? ఇంద దీనికి బిస్కెట్లు కొనుక్కో." అని ఓ రూపాయి విమల చేతిలో పెట్టాడతను.

విమల కాస్త దూరం వెళ్ళి ఉత్తరం విప్పింది.

'నామనసు దోచుకున్న యవ్వనకు

సుబ్బారావు వ్రాయునది. నీ పేరుని చూచి నీవెంతో అందంగా ఉంటావని పిస్తోంది. నీ అందమైన అక్షరాల తోనే నా మనసు కొనేశావు. ఇకనేను ఎప్పటికీ నీవాడినే. మన ప్రేమలత రోజురోజుకు అల్లుకు పోతుంది. నీకోసం ఏమైనా చేస్తాను. ఈ లోకమంతా మన ప్రేమతో నిండి పోవాలి. నీ మలి వెచ్చని కౌగిలి కోసం ఎదురు చూసే—

నీ దాసుడు

సుబ్బారావు.'

విమల ఆ ఉత్తరం చదివి నవ్వుకుంది. మర్నాడు సాయంత్రం యధాప్రకారం సుబ్బారావు నవమన్మధుడిలా పార్కుకి చేరుకున్నాడు. ఇంకా యవ్వన రాలేదు. కోపం నటించాలి అనుకున్నాడు. కొద్దిసేపటికి విమల వచ్చింది. ఆవెనుక యవ్వన వస్తుందేమోనని చూచాడు. రావడం లేదు.

"మీ అక్కయ్యేది ?"

విమల మాట్లాడ లేదు.

"మీ నాన్నగారు కానీ, అమ్మగారు కానీ మీ అక్కయ్యను కేకలేశారా ?"

ఉన్నట్టుండి ఆపిల "నేనే యవ్వనను." అంటూ మెరుపులా పరుగెత్తి మాయమయింది.